క్లుప్తంగా

యువత క్రీడల్లో రాణించాలి

దుమ్ముగూడెం: ఏజెన్సీలోని యువత క్రీడల్లో రాణించాలని దుమ్ముగూడెం సీఐ బి. అశోక్ అన్నారు. గురువారం మండలంలోని ములకపాడు క్రీడా మైదానంలో దుమ్ముగూడెం క్రికెట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న సంక్రాంతి క్రికెట్ టోర్నమెంట్ పోటీలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. యువత చదువుతో పాటుగా క్రీడలలో కూడా రాణించాలని చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలని సూచించారు. మారుమూల ప్రాంతాల్లో ఉండే క్రీడాకారుల వారి ప్రతిభను వెలికి తీసేందుకు క్రీడా పోటీలు నిర్వహిస్తున్న మేనేజ్‌మెంట్ వారిని సీఐ అభినందిస్తూ వారికి తన వంతు సహకారం అందిస్తానని తెలిపారు. అనంతరం సీఐ కొద్దిసేపు మైదానంలో బ్యాటింగ్ ఆడారు. ఈ కార్యక్రమంలో ఎస్సై గణేష్, డాక్టర్ రుక్మాకర్ రెడ్డి, దుమ్ముగూడెం సీనియర్ క్రీడాకారులు రఘు, హరికృష్ణ, కామేష్, రాము, మేనేజ్‌మెంట్ సభ్యులు హేమంత్, చంద్ర శేఖర్, పవన్ తదితరులు పాల్గొన్నారు.

అరెస్టులు దుర్మార్గం

మణుగూరురూరల్: ప్రజాసమస్యలపై ప్రశ్నించిన వారిపై అక్రమ కేసులు బనాయించడం, బెదిరింపులకు పాల్పడడం దుర్మార్గమని బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు, పినపాక మాజీ ఎమ్మెల్యే రేగా కాంతారావు గురువారం సోషల్ మీడియా వేదికగా అన్నారు. బీఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకుడు, ఎస్సీ, ఎస్టీ కమిషన్ మాజీ చైర్మన్ డాక్టర్ ఎర్రోళ్ల శ్రీనివాస్‌ను ఎటువంటి నోటీసులు, ముందస్తు సమాచారం లేకుండానే కాంగ్రెస్ ప్రభుత్వం పోలీసులతో అక్రమంగా అరెస్ట్ చేయించడం దారుణమన్నారు. ఈ అక్రమ అరెస్టును తాము తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. ప్రజాప్రభుత్వం, ప్రజాస్వామ్య పాలన పేరుతో రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం రాక్షస పాలన సాగిస్తోందని అన్నారు. సెలవు రోజుల్లో కావాలనే బీఆర్ఎస్ నేతలను అరెస్ట్ చేస్తూ సీఎం రేవంత్‌రెడ్డి నియంతలా వ్యవహరిస్తున్నారన్నారు. హోంమంత్రిగా శాంతిభద్రత పరిరక్షణలో సీఎం రేవంత్‌రెడ్డి విఫలం చెందారన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అవలంబిస్తున్న పాలన తీరును ప్రజలు గమనిస్తున్నారని, త్వరలోనే ప్రజలే తగిన బుద్ధి చెబుతారన్నారు.

విప్లవ పార్టీలు ఏకమవ్వాలి

చంద్రుగొండ/అన్నపురెడ్డిపల్లి: దేశంలోని విప్లవ పార్టీలన్నీ ఒకేతాటిపై రావాలని సీపీఐ (ఎంఎల్) న్యూడెమోక్రసీ జిల్లా నాయకులు ఎస్‌కె.ఉమర్ పిలుపునిచ్చారు. చంద్రుగొండ, అన్నపురెడ్డిపల్లి మండలంలోని బుచ్చన్నగూడెం గ్రామాల్లో న్యూడెమోక్రసీ విలీన సభను జయప్రదం చేయాలని గురువారం వాల్‌పోస్టర్లు అవిష్కరించారు. ఈ సందర్భంగా ఉమర్ మాట్లాడుతూ ఈ నెల 28న, హైదరాబాద్‌లో జరిగే విలీన సభను జయప్రదం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఆ పార్టీ నాయకులు వరికూటి వెంకట్రావ్, సవలం విశ్వనాథం, ప్రసాద్, దశరథ్ హనుమంతు, ధర్మరాజు, రామారావు పాల్గొన్నారు.

టీటీడీ క్యాలెండర్ అందజేత

దుమ్ముగూడెం: మండలానికి చెందిన తిరుమల తిరుపతి దేవస్థానం హిందూధర్మ ప్రచార పరిషత్ మండల బాధ్యులు పిలకా నాగేంద్ర రెడ్డి రాష్ట్ర రెవెన్యూశాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డికి టీటీడీ 2025 డైరీ, క్యాలెండర్‌ను గురువారం అందజేశారు. జిల్లా పర్యటనలో ఉన్న మంత్రిని కలిసి వీటిని అందించారు. మండలంలోని నారాయణరావుపేట గ్రామంలో నూతనంగా నిర్మించతల పెట్టిన సమ్మక్క-సారలమ్మ, కాళికాదేవీ ఆలయ నిర్మాణ అభివృద్ధికి సహాయసహకారాలు అందించాలని ఆలయ పూజారి కుర్సం సోమయ్యతో కలిసి వినతిపత్రం అందజేశారు.

రోడ్డు భద్రత అందరి బాధ్యత

కరకగూడెం: వాహనదారులు ట్రాఫిక్ నిబంధనలను పాటించడం ద్వారా తమతో పాటు ఇతరులను సురక్షితంగా ఉంచుకోవచ్చని కరకగూడెం ఎస్సై రాజేందర్ పిలుపునిచ్చారు. ఈ మేరకు ఆయన గురువారం మండల పరిధిలోని పలు గ్రామాల్లో విస్తృతంగా వాహనాల తనిఖీ చేపట్టి నిబంధనల పాటిస్తూ వాహనాలను నడపాలన్నారు. ముఖ్యంగా ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని సూచించారు. రోడ్డు భద్రత అందరి బాధ్యతని ఈ సందర్భంగా గుర్తు చేశారు. తనిఖీల సమయంలో కొన్ని వాహనాలు సరైన పత్రాలు లేకుండా మరికొందరు హెల్మెట్ లేకుండా ప్రయాణిస్తున్నట్లు గుర్తించారు. అలాంటి వాహనదారులకు జరిమానా విధించడమే కాకుండా వారికి కౌన్సిలింగ్ కూడా ఇచ్చారు. ఈ తనిఖీల్లో పోలీస్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఆలయంలో అన్నదానం

మణుగూరురూరల్: మండలంలోని సాయినగర్‌లో వేంచేసియున్న షిరిడి సాయిబాబా ఆలయంలో గురువారం సందర్భంగా సాయినాథుడికి ప్రత్యేక పూజలు, అర్చనలు, అభిషేకాలు నిర్వహించారు. మణుగూరు మండలానికి చెందిన రేపాకుల నర్సింహరావు-పుష్పాంజలి దంపతులు, అరుణ్ చంద్, ఊహశ్రీలు ఆలయంలోని సాయినాథుడికి పూజలు చేశారు. అనంతరం అన్నదాత నరసింహారావు దంపతులు ఆలయ ప్రాంగణంలో భక్తులకు అన్నదాన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. ఆలయ కమిటీ సభ్యులు దోసపాటి నాగేశ్వరరావు, సీహెచ్ బాలకేశ వరావు, అర్చకులు పవన్ కుమార్ వర్మ, గుమస్తా వెంకన్న పాల్గొన్నారు.

ప్రాణ సంకటంగా ప్రయాణం

- అధ్వానంగా రోడ్డు.. నిత్యం దుమ్ము, ధూళి
- పరిపాటిగా మారిన ప్రమాదాలు
- పట్టింపులేని అధికార యంత్రాంగం



లారీ వెనుక ఎగిసిపడుతున్న దుమ్ము, ధూళి



అధ్వానంగా మారిన బీటీపీఎస్ రహదారి

మణుగూరురూరల్: పట్టణంలోని ఓ రహదారి గుండా ప్రయాణం ప్రాణ సంకటంగా పరిణమిస్తోంది. దినదినాభివృద్ధి చెందుతున్న మణుగూరులో మణుగూరు-ఏటూరునాగారం ప్రధాన రహదారిపై పెద్ద పెద్ద గుంతలు ఏర్పడ్డాయి. ఈ రహదారి గుండా ప్రయాణించాలంటేనే వాహనచోదకులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. సీఎస్‌పీ కాటా నుంచి బీటీపీఎస్ వరకు గల రహదారిపై పెద్ద పెద్ద గుంతలు ప్రమాదాలకు నిలయాలుగా మారాయి. ఈ గుంతల్లో పడి ఎంతోమంది వాహనచోదకులు అదుపుతప్పి కింద పడిన సంఘటనలు, గాయాలపాలైన సందర్భాలు అనేకం ఉన్నాయి. ఆ సమయంలో వాహనాలు నిలిచి ట్రాఫిక్ అంతరాయం ఏర్పడిన ఘటనలూ లేకపోలేదు.

ఈ రహదారి గుండా నిత్యం వందలాది వాహనాలు ప్రయాణిస్తుంటాయి. దీనికి తోడు బీటీపీఎస్‌కు బొగ్గు రవాణా చేసే లారీలు, టిప్పర్లు, బీటీపీఎస్‌కు యంత్రాలు తెచ్చే భారీ వాహనాలు ఈ రహదారి మార్గం గుండా రాకపోకలు సాగిస్తుంటాయి. దీంతో భారీ వాహనాల తాకిడి కూడా రహదారిపై గుంతలు ఏర్పడడానికి కారణమనే వాదనలు వినిపిస్తున్నాయి. సంబంధిత అధికారులకు ఎన్నిసార్లు విన్నవించినా.. వినతిపత్రాలు సమర్పించినా నిర్లక్ష్యపు ధోరణిని అవలంబిస్తున్నారు. పత్రికల కథనాల్లో వస్తే ఏర్పడిన గుంతల్లో యాష్, కంకర కలిపి తాత్కాలిక మరమ్మత్తుల చేపడుతున్నారు. అది కొద్దికాలానికే పరిమితమై మరలా గుంతలు ఏర్పడుతున్నాయి. తద్వారా రాకపోకలు సాగించే భారీ వాహనాల వల్ల గుంతల్లో పోసిన బూడిద మొత్తం ఎగిసి పడుతోంది. ఈ ఎగిసిపడే దుమ్ము, ధూళితో వెనుకవచ్చే వాహనదారులు తీవ్ర అవస్థలు పడుతున్నారు. అధ్వానంగా మారిన ప్రధాన రహదారిపై జిల్లా కలెక్టర్, స్థానిక ఎమ్మెల్యే దృష్టి సారించి శాశ్వత పరిష్కారానికి చర్యలు చేపట్టాలని వాహనదారులు, ప్రయాణికులు కోరుతున్నారు. భారీ వాహనాలు తిరుగుతున్న నేపథ్యంలో రోడ్డును కూడా విస్తరించాలని విజ్ఞప్తి చేస్తున్నారు.

శాశ్వత పరిష్కారం చేయాలి

మణుగూరు సీఎస్‌పీ ప్రాంతం నుంచి బీటీపీఎస్ వరకు రోడ్డు తరచూ అధ్వానభరితంగా మారుతోంది. గుంతలమయ రహదారితో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. సంబంధిత అధికారులు స్పందించి రహదారిని పునర్నిర్మించి సమస్యను శాశ్వతంగా పరిష్కరించాలి.

– శ్యామ్‌ప్రసాద్, రామానుజవరం

గుంతలతో ఇబ్బందులు..

బీటీపీఎస్ రహదారిపై పెద్ద పెద్ద గుంతలు ప్రమాదకరంగా ఉన్నాయి. ఈ మార్గం గుండా రాకపోకలు సాగించాలంటేనే భయాందోళన చెందుతున్నాం. ఎన్నిసార్లు అధికారులకు విన్నవించినా ఫలితం లేకుండాపోతోంది. జిల్లా కలెక్టర్ స్పందించి రహదారి సమస్యను పరిష్కరించాలి.

– నాగేశ్వరరావు, సాంబాయిగూడెం


ప్రాణభయంతో ప్రయాణం..

మణుగూరులోని పీఎస్‌పీ కాటా నుంచి బీటీపీఎస్ వరకు ప్రాణాలు అరచేతిలో పెట్టుకుని భయం భయంగా ప్రయాణిస్తున్నాం. రాత్రివేళల్లో పరిస్థితి మరింత ప్రమాదకరంగా ఉంది. ఈ పరిస్థితిపై జిల్లా అధికారులు స్పందించి రోడ్డు మరమ్మతులు చేయాలి.

– శ్రీనివాసరావు, బీటీపీఎస్ కార్మికుడు

వైద్యులు ఫుల్.. సేవలు నిల్

- సత్యనారాయణపురం వైద్యశాలలో స్టాఫ్ నర్సులే దిక్కు
- ఇద్దరు వైద్యులు ఉన్నా పనితీరు సున్నా



సాయంత్రం 4 గంటల వరకు ఆస్పత్రి తెరిచి ఉంటుందని ఏర్పాటు చేసిన బోర్డు



సాయంత్రం 3.30 గంటలకు వైద్యశాలలో ఖాళీగా ఉన్న డాక్టర్ కుర్చీ

చర్ల: సత్యనారాయణపురం ప్రభుత్వ వైద్యశాలలో ఇద్దరు వైద్యులున్నప్పటికీ వైద్య సేవలు అంతంత మాత్రంగానే అందుతున్నాయి. గతంలో ఈ వైద్యశాలలో ఒక్కరే డాక్టర్ ఉన్నప్పటికీ వైద్యసేవలు సక్రమంగానే అందాయి. ఇప్పుడు ఇద్దరు ఉన్నప్పటికీ వైద్య సేవలు పడకేశాయి.

50 గ్రామాలకు ఒక్కటే వైద్యశాల

సత్యనారాయణపురంలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలో దేవరాపల్లి, కుదునూరు, ఆర్ కొత్తగూడెం, సత్యనారాయణపురం, కుర్నపల్లి, బోదనెల్లి, పెద్దిపల్లి, కలివేరు, తేగడ, గొమ్ముగూడెం, చిన మిడిసిలేరు, పెదమిడిసిలేరు, తిప్పాపురం తదితర గ్రామ పంచాయతీలు ఉండగా.. ఈ పంచాయతీల పరిధిలోని 50కు పైగా గ్రామాల్లో 30 వేలకు పైగా జనాబా ఉన్నారు. వీరిలో గిరిజనులు, ఆదివాసీలే ఎక్కువ సంఖ్యలో ఉంటారు. అయితే వీరందరికీ సత్యనారాయణపురం ప్రాథమిక ఆరోగ్య కేంద్రమే వైద్యానికి పెద్ద దిక్కు. అయితే గతంలో ఇక్కడ ఏళ్ల తరబడి ఒక్కరే డాక్టర్ వైద్య సేవలు అందించారు. రాష్ట్ర ప్రభుత్వం ఇటీవల వైద్యశాల్లో ఖాళీలను భర్తీ చేసే ప్రక్రియలో భాగంగా మరో డాక్టర్‌ను కూడా కేటాయించారు.

అందుబాటులో ఉండని వైద్యులు..

ప్రస్తుతం ఈ వైద్యశాలో ఇద్దరు వైద్యులు ఉన్నారు. అయినప్పటికీ వైద్యులు సకాలానికి వైద్యశాలకు రావడం లేదని, వచ్చిన వైద్యశాలలో ఉండడం లేదని స్థానికులు చెబుతున్నారు. ఏదైనా అత్యవసర పరిస్థితుల్లో వైద్యశాలకు వెళ్తే అక్కడి స్టాఫ్‌నర్సులు, ఇతర సిబ్బంది మాత్రమే వైద్య సహాయం అందిస్తున్నట్లు తెలుస్తోంది. సాధారణంగా వైద్యశాలలో ఉదయం 9.00 గంటల నుంచి మధ్యాహ్నం 1.00 వరకు, మధ్యాహ్నం 2.00 గంటల నుంచి 4.00 గంటల వరకు ఈ వైద్యశాలలో వైద్యులు, సిబ్బంది అన్ని రకాల వ్యాధులకు వైద్య సేవలనందించాల్సి ఉంది. అత్యవసర పరిస్థితిల్లో వైద్యశాలకు వచ్చే రోగులకు మాత్రం 24 గంటలు వైద్య సేవలు అందించవలసి ఉంది. అయితే ఇక్కడ వైద్యులు మాత్రం నిర్దేశిత సమయంలో కూడా వైద్యశాలలో అందుబాటులో ఉండడం లేదు. ఇందులకు గురువారం జరిగిన ఓ సంఘటనే నిదర్శనం. గురువారం మధ్యాహ్నం 2.30 గంటలకు కుదునూరు నుంచి ఓ రోగి వైద్యశాలకు వచ్చాడు. ఈ సందర్భంలో వైద్యశాలలో ఉన్న స్టాఫ్ నర్సే ఆ రోగికి దిక్కయింది. ఇద్దరు ఉన్న వైద్యశాలలో అందుబాటులో ఒక్క వైద్యుడు కూడా లేడు. వైద్యుడి కోసం రోగి ఎదురుచూస్తుండగా.. గంట తరువాత అంటే 3.30 గంటలకు వైద్యశాల ఆవరణలో ఉన్న క్వార్టర్స్‌లో ఉన్న డాక్టర్‌ను సిబ్బంది వెళ్లి తలుపులు కొట్టి లేపారు. అప్పుడు గానీ ఆ వైద్యుడు మెల్లగా రాలేదు. సత్యనారాయణపురం వైద్యశాలపై వైద్య ఆరోగ్యశాఖాధికారులు, ఎమ్మెల్యే, మంత్రులు దృష్టి సారించి గిరిజనులు, ఆదివాసీ ప్రజానీకానికి సక్రమంగా వైద్య సేవలు అందేలా కృషి చేయాలని పలువురు కోరుతున్నారు.

సీఆర్టీల మౌన ప్రదర్శన



ఐటీడీఏ ఎదుట మోకాళ్లపై నిరసన వ్యక్తం చేస్తున్న సీఆర్టీలు

భద్రాచలంటౌన్: గిరిజన సంక్షేమ శాఖలో విధులు నిర్వహిస్తున్న కాంట్రాక్టు రెసిడెన్షియల్ టీచర్స్ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ.. గురువారం పట్టణంలో మౌన ప్రదర్శన నిర్వహించారు. అనంతరం ఐటీడీఏ కార్యాలయం ఎదుట మోకాళ్లపై నిల్చును నిరసన వ్యక్తం చేశారు.

ఈ సందర్భంగా పలు సంఘాల నాయకులు మాట్లాడుతూ.. సీఆర్టీల సమస్యలను ప్రభుత్వం త్వరగా పరిష్కరించి వారిని ఆదుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో మునిగడప రామాచారి, రాజు, మోహన్‌లాల్, శ్రీనివాస్, రవికుమార్, శివనాయక్, రాజేష్, వీరన్న, బాబురావు, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

చర్చలు జరపాలి

సమ్మె చేస్తున్న గిరిజన సంక్షేమ కాంట్రాక్టు రెసిడెన్షియల్ టీచర్స్, సమగ్ర శిక్ష ఉద్యోగుల సమస్యలపై ప్రభుత్వం చర్చలు జరిపి సమస్యలు పరిష్కరించాలని తెలంగాణ ప్రోగ్రెసివ్ టీచర్స్ ఫెడరేషన్ (టీపీటీఎఫ్) రాష్ట్ర కార్యదర్శి బుటారి రాజు అన్నారు. ఈ మేరకు ఐటీడీఏ ఎదుట సీఆర్టీలు నిర్వహిస్తున్న సమ్మె శిబిరాన్ని టీపీటీఎఫ్ నాయకులు గురువారం సందర్శించి సమ్మెకు మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా రాజు మాట్లాడుతూ.. సీఆర్టీలు రెగ్యులర్ ఉపాధ్యాయులతో సమానంగా విధులు నిర్వహిస్తున్నప్పటికీ అతి తక్కువ వేతనంతో పని చేయవలసి వస్తుందని ఆరోపించారు. ఇప్పటికైనా ప్రభుత్వం ఉద్యోగులను చర్చలకు పిలిచి వారి సమస్యలను పరిష్కారించాని ఆయన డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయ దర్శిని సంపాదక వర్గ సభ్యుడు మునిగడప రామాచారి తదితరులు పాల్గొన్నారు.

మూడు రోజులు నీటి సరఫరా బంద్

మణుగూరుటౌన్: మున్సిపాలిటీ పరిధిలోని ఇన్‌టేక్‌వెల్‌లో సిల్టు తొలిగింపులో భాగంగా నీటి సరఫరాకు అంతరాయం ఏర్పడుతుందని మున్సిపల్ కమిషనర్ యాదగిరి గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. వేసవి కాలం ముందస్తు జాగ్రత్త చర్యల్లో భాగంగా సిల్టు తీసివేత కార్యక్రమం చేపట్టామని ఆదివారం వరకు తాగు నీటి సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందని తెలిపారు.

భీమ్‌రావ్ మృతి తీరనిలోటు

భద్రాచలంటౌన్: ఏటూర్ నాగారం ఐటీడీఏ కార్యాలయంలో ఏపీఓగా విధులు నిర్వహిస్తున్న కనక భీమ్ రావు ఆకాల మృతి తీరని లోటని భద్రాచలం ఐటీడీఏ ఏపీఓ డేవిడ్ రాజ్ గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. గత కొంత కాలంగా అనారోగ్య సమస్యలతో బాధపడుతున్న ఏపీఓ భీమ్‌రావు మరణించారు. ఈ వార్త తెలియగానే భద్రాచలం ఐటీడీఏ కార్యాలయంలోని యూనిట్ అధికారులు సిబ్బంది శోక సముద్రంలో మునిగిపోయి.. భద్రాచలం భీమ్ రావు పనిచేసిన గత స్మృతులను నెమరు వేసుకున్నారు. వారి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతిని తెలిపారు.

ఇంటిబాట పడుతున్న కేజీబీవీ విద్యార్థినులు

అన్నపురెడ్డిపల్లి(చంద్రుగొండ): ఉపాధ్యాయులు సమ్మె వీడకపోవడంతో కస్తూర్బాగాంధీలోని విద్యార్థినులు ఇంటిబాట పడుతున్నారని ఎస్ఎఫ్ఐ జిల్లా నాయకులు రామ్‌చరణ్ ఆవేదన వ్యక్తం చేశారు. గురువారం కేజీబీవీ ఎదుట ఆయన నిరసన వ్యక్తం చేశారు. ప్రభుత్వం సత్వర చర్యలు తీసుకుని ఉపాధ్యాయుల న్యాయమైన సమస్యలను పరిష్కరించాలని కోరారు.

వంగవీటికి ఘన నివాళి

అశ్వారావుపేటరూరల్: మండలంలోని నారాయణపురం గ్రామంలో వంగవీటి మోహన రంగ వేడుకలను గురువారం ఘనంగా నిర్వహించారు. ముందుగా విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో అభిమానులు ఆకుల శ్రీను, పసుపులేటి నరేష్, చిన్నంశెట్టి నాగేంద్రరావు, శ్రీనివాసరావు, కొండయ్య పాల్గొన్నారు.

ఎమ్మెల్యే పరామర్శ

అశ్వాపురం: మండల పరిధిలోని గొందిగూడెం గ్రామానికి చెందిన వర్సా వీరమ్మ అనారోగ్యంతో గురువారం మృతి చెందింది. వారి నివాసంలో పినపాక ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు వీరమ్మ మృతదేహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించి మృతురాలి కుటుంబసభ్యులను పరామర్శించారు. మాజీ సర్పంచ్ పాయం భద్రమ్మ, నాయకులు పాల్గొన్నారు.

అన్నదానానికి విరాళం

భద్రాచలంటౌన్: భద్రాచలం పట్టణంలోని జూనియర్ కళాశాల సెంటర్‌లోని సాయిబాబా మందిరంలో జరిగే అన్నదాన కార్యక్రమానికి ఒక భక్తుడు విరాళం అందజేశారు. పట్టణానికి చెందిన మోతుకూరి కృష్ణ-ఈశ్వరమ్మ దంపతులు రూ.54 వేలలను ఆలయ కమిటీ సభ్యులకు గురువారం అందజేశారు. ఈ సందర్భంగా సుమారు వెయ్యి మంది అయ్యప్ప మాలధారులతో పాటు వృద్ధులకు అన్నదాన వితరణ కార్యక్రమం నిర్వహించారు. రవికుమార్, ఆదినారాయణ, రమేష్ పాల్గొన్నారు.

మంత్రి మద్దతు ఎవరికి?



మంత్రి పొంగులేటిని కలిసిన టీఎన్‌టీయూసీ నాయకులు


బూర్గంపాడు: ఐటీసీ పీఎస్‌పీడీలో గుర్తింపు కార్మిక సంఘ ఎన్నికల నేపథ్యంలో గురువారం రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డిని ఐఎన్‌టీయూసీ, టీఎన్‌టీయూసీ నాయకులు వేర్వేరుగా కలిశారు. ఐటీసీ పీఎస్‌పీడీ గుర్తింపు కార్మిక సంఘ ఎన్నికలలో గెలుపు కోసం తలపడుతున్న ఈ రెండు ట్రేడ్ యూనియన్‌ల నాయకులు మంత్రి పొంగులేటిని కలవటం చర్చనీయాంశంగా మారింది. గత అసెంబ్లీ, పార్లమెంట్ ఎన్నికలలో ఈ రెండు యూనియన్ల నాయకులు కాంగ్రెస్ పార్టీ అభ్యర్థుల గెలుపు కోసం పనిచేశారు. ఇప్పుడు ఐటీసీ పీఎస్‌పీడీ గుర్తింపు కార్మికసంఘ ఎన్నికలలో తమ గెలుపునకు సహకరించాలని రెండు ట్రేడ్ యూనియన్ల నాయకులు మంత్రి పొంగులేటిని కోరటం ప్రాధాన్యతను సంతరించుకుంది. రాష్ట్రమంత్రి పొంగులేటిని కలిసిన వారిలో ఐఎన్‌టీయూసీ రాష్ట్ర నాయకులు వెంకటేశ్వరరెడ్డి, ఐఎన్‌టీయూసీ ప్రధాన కార్యదర్శి పిచ్చిరెడ్డి, పీఏసీఎస్ మాజీ చైర్మన్ పోతిరెడ్డి వెంకటేశ్వరరెడ్డి, టీఎన్‌టీయూసీ నాయకులు పోటు రంగారావు, టీఎన్‌టీయూసీ అధ్యక్షుడు హరిప్రసాద్, రామకోటిరెడ్డి తదితరులున్నారు.

ఉద్యోగుల పనితీరు స్ఫూర్తిదాయకం

మణుగూరుటౌన్: టెక్నాలజీ వైజ్ బెస్ట్ పెర్ఫార్మింగ్ మైన్‌గా మూడో సారి ప్రకాశం ఖని ఓపెన్‌కాస్ట్-2కు అవార్డు లభించడం అభినందనీయమని టీబీజీకేఎస్ వైస్ ప్రెసిడెంట్ నాగెల్లి వెంకట్ అన్నారు.

గురువారం ఆయన ఈ మేరకు ఒక పత్రికా ప్రకటన విడుదల చేశారు. సింగరేణి డైరెక్టర్‌లు వెంకటేశ్వరరెడ్డి సత్యనారాయణ సమక్షంలో కొత్తగూడెం ఏరియాలో రోలింగ్ షీల్డ్ అవార్డు అందుకోవడం అభినందనీయమన్నారు. ఓసీ-2 అధికారి, సీఎంఓఏఐ అధ్యక్షుడు లక్ష్మీపతిగౌడ్, వీరభద్రుడు, సురేశ్, సుదర్శన్ రెడ్డిలు అవార్డు అందుకోవడం పట్ల వారి పనితీరుకు నిదర్శనమన్నారు. ఇదే స్ఫూర్తితో 2024-25 ఆర్థిక సంవత్సరానికి నిర్దేశించిన ఉత్పత్తి ఉత్పాదకత లక్ష్యాల్లో కొనసాగించి మణుగూరును అగ్రభాగాన నిలుపుతాం అని అన్నారు.

హామీలన్నీ అమలు చేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న సీపీఎం జిల్లా నాయకుడు పుల్లయ్య

దమ్మపేట: తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి దృష్టి మరల్చే రాజకీయాలను విడనాడి, ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలు, ప్రజల సంక్షేమం, అభివృద్ధిపై దృష్టి సారించాలని సీపీఎం జిల్లా నాయకులు కొక్కెరపాటి పుల్లయ్య అన్నారు. గురువారం మండల కేంద్రంలో సీపీఎం మండల సమావేశం నిర్వహించారు. సమావేశంలో కొక్కెరపాటి పుల్లయ్య మాట్లాడుతూ.. ఎన్నికల హామీలను మరిపించడానికి హైడ్రా, మూసీ ప్రక్షాళన, సినీ హీరో అల్లు అర్జున్ వంటి అంశాలతో డైవర్షన్ పాలిటిక్స్ నడపటం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. అర్హత కల ప్రతి పేదవాడికి, ఇందిరమ్మ ఇంటిని మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. అంబేడ్కర్‌ను కించపరిచేలా మాట్లాడిన అమిత్ షాను మంత్రి వర్గం నుంచి తొలగించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు దొడ్డా లక్ష్మీనారాయణ, పిట్టల అర్జున్, మొరంపూడి శ్రీనివాసరావు, కొప్పుల శ్రీను, శోభన్ తదితరులు పాల్గొన్నారు.

నిత్యావసరాలు పంపిణీ



సిరిగుండంలో గొత్తికోయలకు నిత్యావసరాలు అందజేస్తున్న పోలీసులు

దుమ్ముగూడెం: మండలంలోని నారాయణరావుపేట పంచాయతీ పరిధిలోని వలస ఆదివాసీ గ్రామం సిరిగుండం గొత్తికోయ ప్రజలకు మండల పోలీసులు గురువారం నిత్యావసరాలను పంపిణీ చేశారు. సిరిగుండం గొత్తికోయ గ్రామంలో ఆదివాసీ కుటుంబాలకు నిత్య అవసర సరుకులు, సోలార్ లైట్లను సీఐ బొడ్డు అశోక్ ఆధ్వర్యంలో అందజేశారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ.. మారుమూల ఏజెన్సీ ప్రాంతాల్లో నివసించే వలస ఆదివాసీ ప్రజల అభివృద్ధి కోసం పోలీస్ శాఖ ఇతర శాఖల అధికారులతో సమన్వయం పాటిస్తూ కృషి చేస్తోందని తెలిపారు. గ్రామంలోకి ఎవరైనా కొత్త వ్యక్తులు ప్రవేశిస్తే వెంటనే పోలీసు వారికి సమాచారం అందించాలని కోరారు. అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడే నిషేధిత మావోయిస్టులకు ఎలాంటి సహాయ సహకారాలు అందించకూడదని సూచించారు. కార్యక్రమంలో ఎస్ఐలు వెంకటప్పయ్య, గణేష్, స్పెషల్ పార్టీ, సీఆర్పీఎఫ్ సిబ్బంది పాల్గొన్నారు.

సీపీఐ శత వసంత వేడుకలు

భారత కమ్యూనిస్టు పార్టీ (సీపీఐ) శత వసంత ఉత్సవాలను గురువారం ఘనంగా నిర్వహించారు. ఆయా ప్రాంతాల్లో పార్టీ కార్యాలయాలు, సెంటర్లలో పార్టీ జెండాలను ఎగురవేశారు. అనంతరం కేక్ కట్ చేశారు. మోటార్ సైకిళ్లతో భారీ ర్యాలీలు నిర్వహించారు. నాయకులు మాట్లాడుతూ.. 1925వ సంవత్సరంలో సీపీఐ కాన్పూర్‌లో ఆవిర్భవించిందని, ఆ నాటి నుంచి ఎన్నో కష్టనష్టాలను చవిచూసిందని అన్నారు. భూమి కోసం, భుక్తి కోసం, బడుగు, బలహీన వర్గాల అభ్యున్నతి కోసం ఎర్ర జెండా పనిచేస్తూనే ఉంటుందని అన్నారు.

– సాక్షి నెట్‌వర్క్



అశ్వారావుపేటరూరల్: భారీ ర్యాలీ నిర్వహిస్తున్న పార్టీ శ్రేణులు



మణుగూరురూరల్: ఎర్రజెండా ఎగురవేస్తున్న సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు అయోధ్య



భద్రాచలంఅర్బన్: కేక్ కట్ చేస్తున్న కల్లూరి వెంకటేశ్వరరావు, రవికుమార్



చంద్రుగొండ: ప్రధాన సెంటర్‌లో మానవహారం నిర్వహిస్తున్న సీపీఐ శ్రేణులు



అశ్వాపురం: మొండికుంటలో జెండా ఆవిష్కరిస్తున్న కమటం వెంకటేశ్వరరావు



బూర్గంపాడు: సారపాకలో పార్టీ జెండాను ఆవిష్కరిస్తున్న సీపీఐ నాయకులు



దుమ్ముగూడెం: సీపీఐ శత జయంతి ఉత్సవాల్లో పాల్గొన్న సీపీఐ కార్యకర్తలు